

నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపిక

- 3 నుండి గజ్వేల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడా సమాఖ్య సెక్రటరీ బాబురావు

2లో...



నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- బోథ్ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఏర్పాట్ల పరిశీలన

5లో...



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | శుక్రవారం | నవంబర్ 3, 2023 www.navatelangana.com



భారీగా జనం..గులాబీమయం..!

- సీఎం పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్
- మంత్రి కృషితోనే నిర్మల్ జిల్లా ఆవిర్భావమని వ్యాఖ్య
- అభివృద్ధి కోసం మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి
- తండోపతండాలుగా తరలివచ్చిన ప్రజలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, నిర్మల్, లక్ష్మణచాంద

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్ నియోజకవర్గ పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. మరోసారి గెలిచి అధికారంలోకి వస్తామని భరోసా నింపింది. సభా ప్రాంగణమంతా గులాబీమయంగా మారింది. గురువారం నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ శివారులో ఏర్పాటుచేసిన ఈ సభకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలోకి రాగానే ఇరువైపులా ఉన్న జనానికి అభివాదం చేశారు. సభకు భారీ సంఖ్యలో జనం రావడంతో గమనించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడే ఇంద్రకరణ్‌రెడ్డి విజయం ఖాయమైందని వ్యాఖ్యానించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ బీఆర్ఎస్ అనుకూల నినాదాలు చేశారు.

జిల్లా ఏర్పాటులో మంత్రి కృషిపై ప్రశంసలు

నిర్మల్ జిల్లా ఏర్పాటులో మంత్రి ఇంద్రకరణరెడ్డి చేసిన కృషిని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లాల ఏర్పాటుపై చర్చించాం. ఉమ్మడి జిల్లాలో బెజ్జూర్ నుంచి ఆదిలాబాద్ రావాలంటే.. ఇక్కడ బాసర నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే జనాలు అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో తొలుత ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాను ఏర్పాటుచేయాలని భావించాం. కానీ ఇంద్రకరణ్‌రెడ్డి మాత్రం ఈ రెండింటితో పాటు నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలను కూడా ఏర్పాటుచేయాలని గంటసేపు తమతో వాదించి ఏర్పాటయ్యేలా చేశారు. ఆయన కృషి కారణంగా ఈ జిల్లాల ఆవిర్భవం జరిగిందని ప్రస్తుతం ఈ నిర్ణయానికి అన్ని జిల్లాల వారు జై కొడుతున్నారని వ్యాఖ్యానించారు. వీటితో పాటు నాలుగు మెడికల్ కళాశాలలు కూడా వచ్చాయని..ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుచేయాలని కూడా అడిగారని..మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని సుమారు 80వేల మెజార్టీతో మరోసారి గెలిపిస్తే అది కూడా మంజూరుచేస్తామని భరోసా ఇచ్చారు.దీంతో పాటు స్వర్ణ ప్రాజెక్టు లైనింగ్ చేపట్టి రైతులకు లాభం చేస్తామని, ఎస్ఆర్ఎస్పీ ముంపు గ్రామాల కోసం లిఫ్ట్‌ను మంజూరుచేస్తామని, పైప్‌లైన్ బాగు చేస్తామని హామీనిచ్చారు. నీటి తీరువా బకాయిలు రద్దు చేశామని, కరెంటు

మిగతా..2లో...



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, ప్రజలకు అభివాదం(పక్కన)



20ఏండ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

- ప్రాజెక్టులను పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే కోనప్ప
- ఐదేండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తా
- నవతెలంగాణతో కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

'గడిచిన 20 ఏళ్లలో సిర్పూరు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్ప చరిత్రలో మిగిలిపోయాడు. తనకు ఒక్క అవకాశమిస్తే ఐదేళ్లలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తా'. అని సిర్పూరు(టి) నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ స ం ద ర ్ భ ం గా 'నవతెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. గడిచిన 20 ఏళ్లలో 15 ఏళ్లు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో కొనసాగిన

మిగతా.. 2లో...



కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం

- కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయడం ఖాయమని, జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రెబ్బెన మండలానికి చెందిన జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాష్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కలను బీఆర్ఎస్ మంట కలిపిందన్నారు. గడచిన పదేళ్లలో ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. ప్రజలు ఇదంతా చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నేటికీ అనేక ప్రాంతాలు బాహ్య ప్రపంచానికి

మిగతా..2లో...

సీపీఐ(ఎం)లో చేరిన ఎస్కే అబ్దుల్లా

నవతెలంగాణ-జన్నారం

ఆరు నెలల క్రితం సీపీఐ(ఎం) నుంచి సీపీఐలోకి వెళ్లిన సీనియర్ నాయకుడు ఎస్కే అబ్దుల్లా తిరిగి సీపీఐ(ఎం)లో చేరడం సంతోషకరమైన విషయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. గురువారం సాయంత్రం ఎస్కే అబ్దుల్లాకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పేదలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పట్టుదలతో కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, బుచ్చన్న, విజయ, లక్ష్మి, రాజన్న, సురేష్, ప్రమీల, అంజన్న, రాజు పాల్గొన్నారు.



నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు బాలుర జట్టు ఎంపిక

ఆసిఫాబాద్ : జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-19 నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జరిగిన జోనల్ లెవెల్ అండర్-19 పోటీల్లో మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ నుండి 60మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వారి నుండి రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడా సమాఖ్య సెక్రటరీ బాబురావు మాట్లాడుతూ ఈ నెల 3న గజ్వేల్ సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడమే లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేసినట్లు వివరించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక స్థైర్యం ఆటలతో పెరుగుతుందన్నారు. ఇదే సందర్భంలో క్రీడా రంగంలో రాణించిన వారికి 2శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం..

(మొదటి పేజీ తరువాయి)

దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తారని ఆకాంక్షించారు. పార్టీలో చేరిన సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ రెబ్బెన మండలంలో బీఆర్ఎస్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినప్పటికీ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సోనియా గాంధీతో సాధ్యమైందని, అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్‌గౌడ్, రెబ్బెన మండల అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజి, గోపి, రాజేష్, నాయకులు ఆసిఫ్, మురళి, జమీర్ పాల్గొన్నారు.

భారీగా జనం..గులాబీమయం..!



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ రూపొందించిన మేనిఫెస్టోను మీ ముందు పెట్టామని గడపగడపకు తీసుకెళ్తామని చెప్పారు. ఆలోచించి అభివృద్ధి వైపు నిలబడాలని మరోసారి ప్రభుత్వాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.


గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం..!

సీఎం కేసీఆర్ నిర్మల్ పర్యటనతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సభా ప్రాంగణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్యాహ్నం 2గంటలకు రాగా.. అంతకుముందే వివిధ ప్రాంతాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఉదయం 11గంటల నుంచే ఆయన రాక కోసం సభలో వేచిచూశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్నంత సేపు జనం ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దారులన్నీ సభవైపే నడిచేలా కనిపించాయి. పట్టణ శివారులో విశాలమైన మైదానంలో నిర్వహించిన సభకు ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలతో పాటు కాలినడకన వేలాదిగా జనం రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. మరోసారి విజయం తమదేనని భరోసా వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్ జిల్లా అంటే కేసీఆర్‌కు ప్రేమ : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ జిల్లా అంటే సీఎం కేసీఆర్‌కు ఎనలేని ప్రేమని మంత్రి, నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రూ.714 కోట్లతో లక్ష్మీనరసింహస్వామి 27వ కాళేశ్వరం ప్రాజెక్టు లైనింగ్ పూర్తయిందన్నారు. రూ.300కోట్లతో ఫామ్‌ఆయిల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మిషన్ భగీరథతో జిల్లాలో తాగునీటి సమస్య తీరిందన్నారు. రోజురోజుకు నిర్మల్ మున్సిపాలిటీలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని సీఎంను కోరారు. ఎస్సారెస్పీ ముంపు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం నిధులు కేటాయించాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాలను, అలాగే ఐటీ పరిశ్రమలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిర్మల్ పట్టణంలో అండర్‌డ్రైనేజీ పనులకు రూ.150 కోట్లు మంజూరు చేయాలని కోరారు. కేసీఆర్ గత రెండురోజులుగా రాజశ్యామల యాగం చేసి నేరుగా నిర్మల్ నియోజకవర్గ ఆశీర్వాదసభకు రావడం శుభసూచకమని, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి, బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థులు జాన్సన్‌నాయక్, అనిల్ జాదవ్, మాజీ ఎంపీ గోడం నగేష్, డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, చిలుక రమణ, ముర్సు సత్యనారాయణ, రాంకిషన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు హాజరైన ప్రజలు



20ఏండ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే కోనప్ప నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో ఇక్కడి నుండి తరలించినా ఏనాడు ఎమ్మెల్యే కోనప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని తెలిపారు. తన స్వార్థ ప్రయోజనం కోసం పార్టీ మారిన కోనప్ప కనీసం ఇక్కడ ప్రత్యామ్నాయంగా నిర్మిస్తామని చెప్పిన వార్దా ప్రాజెక్టు గురించి కూడా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇదే కాకుండా జగన్నాథ్‌పూర్, అడ, బొక్కివాగు, అర్కగూడ, ఉచ్చమల్లి వాగు ప్రాజెక్టుల గురించి కూడా ఏనాడూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదన్నారు. పదుల సంఖ్యలో ఉన్న ఎత్తిపోతల పథకాలు కూడా పని చేయడం లేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటీ అయిన కాగజ్‌నగర్ సమీపంలోని గ్రామాలకు కూడా రోడ్ల సౌకర్యం లేదన్నారు. నియోజకవర్గంలోని పేదల భూములను ఆయనతో పాటు ఆయన అనుచరులు ఆక్రమించుకుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2018 ఎన్నికలకు ముందు ఎస్పీఎం కార్మికులకు రూ.35వేలు ఇస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఇప్పుడు కేవలం రూ.10వేలు, రూ.20వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నాడని, రాబోయే ఎన్నికల్లో ఆ కార్మికులే కోనప్పకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మూతపడ్డ సర్‌సిల్క్ మిల్లు స్థలంలో కొత్త పరిశ్రమ తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పిన ఎమ్మెల్యే, ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్న వేంపల్లిలో సర్వే చేయించి బొగ్గు బావులను ఏర్పాటు చేస్తే యువతకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. తాను గెలిస్తే రాబోయే ఐదేళ్ల కాలంలో యువతకు ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. దో నెంబర్ దందాలతో నియోజకవర్గంలో అరాచకాలు సృష్టిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించడమే కాకుండా, వారు ఆక్రమించుకున్న పేదల భూములను తిరిగి వారికి అప్పగిస్తామని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని, ఎస్పీఎం కార్మికులకు న్యాయం చేస్తామని, మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు వైద్య, విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని ఆయన ఓటర్లను కోరారు.

సీఎం ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బాసర

సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ కొర్వా శ్యామ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం భైంసా శివారులోని పార్డి బైపాస్ వద్ద మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చే విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
శుక్రవారం నవంబర్ 03, 2023

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఏ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2వేల 203, బి రకం రూ.2వేల 183 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, సీఈఓ సాయరెడ్డి, సీఈఓ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ సక్సెస్

● బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం



నవతెలంగాణ-నిర్మల్,లక్ష్మణచాంద

జిల్లా కేంద్రంలోని క్రషర్‌రోడ్డు మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ సక్సెస్ అయింది. మధ్యాహ్నం సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో రాగా కలెక్టరేట్‌లో ఎలిప్యాడ్‌లో దిగారు. మంత్రి నిర్మల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు పుష్ప గుచ్చాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్ సభకు చేరుకొని ప్రజలకు అభివాదం చేశారు. కాగా సభాప్రాంగణం అంతా గులాబీ మయం అయ్యింది. మంత్రి ఐకేరెడ్డి, పార్టీ శ్రేణులు ఆశించిన దానికంటే రెట్టింపు ఉత్సాహంతో ప్రజానీకం తరలివచ్చారు. నిర్మల్ గులాబీ వనాన్ని తలపించింది. ఈ సభతో నిర్మల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరింత గ్రాఫ్ పెరిగింది. పదేండ్లలో కండ్లారా కనిపిస్తున్న అభివృద్ధిని చూస్తున్న నిర్మల్ ప్రజానీకం మూడోసారి సీఎం కేసీఆర్‌ను, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించేందుకు మహిళలు, యువత, అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సభకు తరలివచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం...

నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు బీఆర్ఎస్ అభిమానులు, నాయకులు, నియోజకవర్గ ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కాల్వా గ్రామానికి చెందిన మహిళలు ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. విషయం తెలిసిన వెంటనే మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, స్థానిక ఆదిత్య హాస్పిటల్‌కి వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని, ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. అధైర్యం చెందవద్దని ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని మంత్రి భరోసానిచ్చారు. ప్రతీ కార్యకర్త, బీఆర్ఎస్ అభిమానులు, నాయకులు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోంస్లే నారాయణ్‌రావు పటేల్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భోస్లే నారాయణ్‌రావు పటేల్

నవతెలంగాణ-భైంసా

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ముధోల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఆగడాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సుఖసంతోషాలతో లేరని తెలిపారు. రైతులకైతే ఎన్నడూ లేని కష్టం వచ్చిందని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం తెలంగాణ వచ్చిన తర్వాత కూడా పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను తప్పదని, దీనికి ఉదాహరణలే తెలంగాణ రాష్ట్రమని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆరు హామీలే తమకు బ్రహ్మాస్త్రమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌రావు పటేల్, మున్సిపల్ మాజీ చైర్మెన్ బ్లాక్ అధ్యక్షులు సల్ల రమేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఆలూరు ప్రశాంత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అంజాద్, భైంసా పట్టణ అధ్యక్షులు నడిమిశెట్టి భూమన్న, దొడ్డకింది రామేశ్వర్, మోయిజ్ ఆహ్మద్, అబ్దుల్ బారి, శంకర్ చంద్రే, రామచంద్రారెడ్డి, రాజేశ్వర్ దేశ్‌ముఖ్, జయరాం నాయక్, యు.భూషణ్, ఇమ్రాన్, సంపత్, అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పల్సి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం 22వ రోజుకు చేరుకున్నాయి. గ్రామ మున్నూరు కాపు సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల కిందట పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని మండల నాయకులకు, అధికారులకు, ఎమ్మెల్యేకు, వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వేరే గ్రామాన్ని మండలంగా ప్రకటించడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పల్సి మండలంగా ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉందని అన్నారు. తక్షణమే మండలంగా ప్రకటించాలని లేదంటే రానున్న అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని వారు పేర్కొన్నారు. మండలంగా ప్రకటించే వరకు ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మున్నూరు కాపు సంఘం సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

నవతెలంగాణ

డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

● రాంపూర్ గ్రామంలో జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని రాంపూర్ గ్రామంలో భారత ప్రజాతంత్ర యోజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర యోజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) పంజాబ్ రాష్ట్రంలోని ల్యూబియానా పట్టణంలో నవంబర్ 1, 2, 3వ తేదీల్లో జరిగిన మహాసభల్లో డీవైఎఫ్ఐ ఏర్పడిందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీలు లేకుండా మోసం చేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టిన మోడి సర్కార్ నిరుద్యోగులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంటికో ఉద్యోగమని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని, నిరుద్యోగులను పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిరుద్యోగులు, యువకులు తగిన గుణపాఠం చెపుతారన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు చాపిడి శివ, చాపిడి శ్రావణి, మండల ఉపాధ్యక్షులు చల్లూరి వంశీ, కార్తీక్, నాయకులు హరీష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తడిపొడి వరి సాగుతో నీరు ఆదా రైతులకు లబ్ధి

నవతెలంగాణ-జన్నారం



మారుతున్న వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగకుండా వ్యవసాయంలో మార్పులు అవసరమని, తడి పొడి వరి సాగు విధానంతో నీరు ఆదా చేసుకోవచ్చని ఏడీఏ అనిత, కోర్ కార్బన్ ఎక్స్ సోలుషన్ అసోసియోటెడ్ ఉపాధ్యక్షుడు నర్సింహ రెడ్డిలు పేర్కొన్నారు. తడి పొడి పద్ధతులతో వరి సాగు విధానం గురించి గురువారం మండలం కలమడుగు రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పద్ధతిలో రంద్రాలు ఉన్న ప్లాస్టిక్ గొట్టం ఉపయోగించి పొలంలో ఉండే నీటి మోతాదును గుర్తించి అవసరమైన నీటిని ఇవ్వవచ్చన్నారు. అమర్చిన గొజ్జంలో మట్టిని తీసివేయడం వల్ల గొట్టం నీటి మట్టంను సూచిస్తుందన్నారు. ఈ విధానం నాటు వేసిన రెండు వారాల తర్వాత ప్రారంభించవచ్చన్నారు. చౌడు నేలల్లో ఈ విదానం అవలంబించరాదని, నీటి గొట్టం అమర్చే టప్పుడు గొట్టంలోని మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈ తడి పొడి విధానం ద్వారా మిథోన్ అనబడే కాలుష్య కారకం విడుదల తగ్గుతుందన్నారు. నేల భౌతిక పరిస్థితులు మెరుగుపడటవే కాకుండా యంత్రం ద్వారా కొతకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. ఈ పద్ధతి ఉపయోగించడం ద్వారా మనం నీటి వినియోగాన్ని 10 నుంచి 30 శాతం తగ్గించవచ్చన్నారు. ఆసక్తి గల రైతులు ఈ విధానం ఉపయోగిస్తే వ్యవసాయ అధికారులను కాని సీసీఎక్స్ సిబ్బందిని గాని సంప్రదిస్తే రైతులకు అన్ని విధాలు సహకరిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కలమడుగు గ్రామ సర్పంచ్ కార్తికారావు, ఏఓ సంగీత, ఎక్జివో డైరెక్టర్ మనోహర్, ఏఈఓ దివ్య, జిల్లా మేనేజర్ విజయ్ పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించన తలపెట్టి మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్టు ఎంపీడీఓ ఎంఏ అలీం ప్రకటించారు. సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ బోజన్న, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ అప్పని స్వరూప, ఏఓ దేవులపల్లి వందన, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, విద్యుత్ ఏఈ స్వర్ణలత, సీసీఓ రాంబాబు హాజరయ్యారు.

గడపగడపకు బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని బీఆర్ఎస్ ప్రచారం కొనసాగుతుంది. మేనిఫెస్టోనూ, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తు అభ్యర్థి కోవలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. గురువారం మండలంలోని పాసిగాం, వరదలగూడ, తుంగెడ, పోతెపెల్లి, మాధవాయిగూడ గ్రామాల్లో ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆపదలో ఆదుకొనే పార్టీ బీఆర్ఎస్ అని, రైతు కష్టాల్లో ఉన్నారని తెలుసుకొని రైతుబంధు, రైతుబీమా పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఆడపిల్ల పుడితే భారం కాకుండా కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ రూపంలో ఆడపిల్లకు రూ.1లక్ష116 బరోసా కల్పించారని తెలిపారు. ఆసరా పెన్షన్‌తో అవ్వ, తాతలకు, వితంతు, వికలాంగులకు బాసటగా కేసీఆర్ నిలిచారన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలు అందించారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆసిఫాబాద్ గడ్డపై గులాబి జెండాను ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో పాసిగాం, తుంగెడ సర్పంచులు శ్రీనివాస్, డోంగ్రి పెంటయ్య, పీఏసీఎస్ ఛైర్మెన్ కార్నాదం సంజీవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నాయకులు దుర్గం రాజేష్, జుమ్మి ఆనంద్‌రావు, రంగు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఆలన' సేవలతో రోగికి ఆత్మస్థైర్యం

● మండలంలో ఆలన సేవా బృంద పర్యటన

నవతెలంగాణ-భీమారం

'ఆలన' సేవలతో రోగిలో ఆత్మస్థైర్యం నిండుతుందని మంచిర్యాల డివిజన్ ఆరోగ్య అధికారి సీహెచ్ఓ రామూర్తి అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులకు వైద్య సేవలు అందించేందుకు 'ఆలన' సేవా బృంధం గురువారం మండల కేంద్రంలో పర్యటించింది. ఈ నేపథ్యంలో బృంధం పనితీరును ఆయనతో పాటు హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బృధం ప్రత్యేక వాహనం ద్వారా రోగుల ఇంటి వద్దకే వచ్చి అవసరమైన మందులు, వ్యాయామ సలహా సూచనలు ఇస్తారు. వృద్ధులతో పాటు క్యాన్సర్, పక్షవాతం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బయటకు వెళ్ళలేని స్థితిలో ఉన్న వారికి ఈ ప్రత్యేక బృదం సేవలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీ హర్షిణి, ఏఎన్ఎం ఉమాదేవి, హెల్త్ అస్టెంట్ వేణు, ఆశాలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వాహనం తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం సమీపంలో టోల్ గేట్ సమీపంలోని పోలీస్ చెక్ పోస్ట్ వద్ద బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. కాసిపేటకు వెళ్తున్న సమయంలో ఎన్నికల నిబంధనల ప్రకారం వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఎమ్మెల్యే సహకరించారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్ష పదవికి రాజీనామ

నవతెలంగాణ-భీమారం

మండలంలోని మద్దికల్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిలకాని కనకయ్య తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. స్వరాష్ట్ర ఆకాంక్షల సాధన కోసం ఉద్యమ కాలంలో అలుపెరుగని పోరాటం చేసిన తాను అందుకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలల్లో ప్రస్తుత మండల జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధుల గెలుపు కోసం నిరంతరం శ్రమించానని గుర్తు చేశారు. కానీ ఈ మధ్య మండల పార్టీ న్యాయకత్వంలో తమకు సరైన గుర్తింపు దక్కకపోవడంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నాడు. రానున్న రోజుల్లో సుమారు 200 మంది గ్రామ యువతతో భవిష్యత్ కార్యాచరణను ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్తామన్నారు.

సమర్ధవంతమైన నాయకత్వానికి ఓటు వినియోగించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్

నవతెలంగాణ-వేమనపల్లి

భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన ఓటు హక్కు ద్వారా సమర్ధవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని, 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం రామగుండం కమీషనర్ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకెన్, ఆర్పీఎఫ్ అధికారి దినేష్, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి సిదాం దత్తుతో కలిసి మండలంలోని సుంపుటం, జాజులపేట గ్రామాల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 3 నియోజకవర్గాలకు జరుగనున్న ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30న పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకొని 100 శాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకొని మనకు మంచి చేసే సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా మనకు మంచి చేసే నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అని అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.



అనంతరం కమీషనర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటు హక్కు, ఓటు విలువ వివరించడంతో పాటు ఈ నెల 30 పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఫెర్రి పాయింట్స్ వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిరంతరం నిఘా ఏర్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ సీఐ వాసుదేవా రావు, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, వేమనపల్లి తహసీల్దార్ సదానందం, ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి

● ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ ఛైర్మెన్ జోగుప్రేమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌కే మరోసారి పట్టం కట్టాలని మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ కోరారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. గడప గడపకు తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ అబివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలతో కూడిన కరపత్రాలను అందజేస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, సామాన్య ప్రజానికానికి అండగా నిలిచేలా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు పేదలతో ఎంతో లాభాదాయకమన్నారు. ప్రచారంలో విశేష ప్రజాదరణ లభిస్తోందని స్పష్టం చేసిన ఆయన తమ ప్రభుత్వ పథకాలు దేశం దృష్టిని ఆకర్షించేలా ఉన్నాయని కితాబిచ్చారు. బీఆర్ఎస్‌కి ఓటు వేసి ఎమ్మెల్యేగా జోగు రామన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, కోవ రవి, నాయకులు కొండ గణేష్, రామేశ్వర్, మహేందర్, సంజయ్, విట్టల్, విలాస్, రమణ బాయి, గోవర్ధన్ యాదవ్, సత్యనారాయణ గౌడ్, పర్వీన్ ఫేరోజ్ పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి

● ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, రిటర్నింగ్ అధికారి చాహాత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి చాంబర్, ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనల మేరకు నామినేషన్ పత్రాలను స్వీకరించాలన్నారు. నామినేషన్ పత్రాలు అందించే కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశీలనపై పూర్తి స్పష్టత, అవగాహనతో ఉండాలన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. బ్యారిగేట్, సీసీ కెమెరాలు, వసతులు, బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చందర్, ఎన్నికల డీటీ సూరజ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని సుందనగర్ కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమనికి మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లలో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపొంది మూడవ సారి అధికారం చేపట్టడం ఖయామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అమలు చేస్తున్న పథకాలతో ఇతర పార్టీల నుంచి వలస వస్తున్నారన్నారు. ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అశ్రఫ్, గణేష్ నాయుడు, సలీం, బోజారెడ్డి, శంకర్, ఇబ్బు పాల్గొన్నారు.



బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షోభ పాలన

● ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన కొనసాగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజా సంక్షోభ పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గిరిజనులతో మమేకమవుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. జాముల్దరి, పిప్పల్‌ధరి, ఖండాల, లోహార, తిప్పా, హత్తి గుట్ట, మొగులాల్ గుట్టలో విస్తృరంగా పర్యటించారు. ఆదివాసీల సాంప్రదాయాన్ని గౌరవిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ఆదివాసులతో కలిసి నేలపై కూర్చొని వారితో కలిసి చర్చ జరిపారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలపై భారాలను మోపాయే తప్ప సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులపై లాఠీచార్జీలు చేసిందని, గ్యాస్ ధర రూ.1200కు పెంచిందన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతు సంక్షేమ పథకాలను వ్యతిరేకిస్తూ అదే రైతులను ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ప్రజాస్వామ్య పాలన కరువై ప్రజా సంక్షోభానికి గురి చేస్తుందన్నారు. కేవలం తెలంగాణలో మాత్రమే రైతులు, ప్రజానికం ప్రశాంతంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ గంద్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, ఆత్మ ఛైర్మెన్ జిట్ట రమేష్, మార్కెట్ ఛైర్మెన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, మార్కెట్ వైస్ ఛైర్మెన్ బొమ్మకంటి రమేష్, మండల అధ్యక్షుడు కనక రమణ, సేవ్వా జగదీష్, మల్లేష్, గంగయ్య యాదవ్, అరె నరేష్, భీమ్‌రావ్ పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బీఆర్ఎస్ పార్టీ ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాయి నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. సాయినగర్ కాలనీ వాసుల కొరిక మేరకు స్మశాన వాటికను మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సురేందర్ యాదవ్, పీఏసీఎస్ ఛైర్మెన్ కదం ప్రశాంత్, నాయకులు అల్లకొండ ప్రశాంత్ పాల్గొన్నారు.



తాంసి : నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపు కోసం మండలంలోని పాలోది, వాడ్డడి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి అనిల్ జాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, శ్రీదర్ రెడ్డి, శ్రీనివాస్, అరుణ్, గోవర్ధన్ రెడ్డి, కేశవ రెడ్డి, రఘు ఉన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు జామడ, పుసిగూడలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను గ్రామ ప్రజలకు వివరించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవా లక్ష్మీని భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మెన్ అడే సురేష్, ఎంపీటీసీ పరమేశ్వర్, జామడ సర్పంచ్ ముక్తా రూపదేవ్, ఉపసర్పంచ్ చౌహన్ మహేందర్, మాజీ ఉప సర్పంచ్ దాదేఅలీ, నాయకులు సయ్యద్ ఖాసీం ఉన్నారు.

నేటి నుండి నామినేషన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమీషన్ షెడ్యూలు మేరకు ఆదిలాబాద్, బోథ్ శాసనసభ నియోజకవర్గాల్లో నేటి నుండి నామినేషన్లు స్వీకరించనున్నామని, ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3 నుండి 10 వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలలోపు ఆయా రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల వరకు మూడు వాహనాలకు అనుమతి ఉంటుందని, అభ్యర్థితో పాటు నలుగురు మద్దతుదారులతో కలిసి నామినేషన్ సమర్పించవచ్చని సూచించారు. జనరల్ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ దరఖాస్తులో అన్ని ఖాళీలను పూరించి అందించాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలో డైమండ్ కాంప్లెక్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలతో చెప్పులు, ఫర్నీచర్ దగ్ధం అయ్యాయి. స్థానికులు, దుకాణం యజమాని తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్ కారణంగా చెప్పుల దుకాణంలో మంటలు చెలరేగాయి. దీనితో స్థానికులు గమనించి యజమానికి,అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది రావడం అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే చుట్టూ పక్కల దుకాణాలకు మంటలు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాదితుడు తెలిపారు.

రేపటి కుమురం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 4న గోండు వీరుడు కుమురం భీం అనుచరుడు కుమురం సూరు వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూరు వర్ధంతి నిర్వహణ కమిటీ ఛైర్మెన్ మడవి రాజేశ్వర్ కోరారు. గురువారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న మండలంలోని గోండుగూడ పంచాయతీలోని కొలంగూడాలో వర్ధంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీఓ ఛాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీఎస్పీలు హాజరవుతారని తెలిపారు. కుమురం సూరు ఆదివాసీ హక్కుల కోసం చేసిన సేవలను ప్రతి ఆదివాసీ గుర్తించాలన్నారు. అధిక సంఖ్యలో గిరిజనులు తమ సంస్కృతిని చాటేల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధంతి నిర్వహణ కమిటీ వైస్ ఛైర్మెన్ సిడాం ధర్ము, కన్వీనర్ కుమ్ర రాజు, నాయకులు బాపురావు, ముకుందరావు, నగేష్, భీంమావు, జంగు ఉన్నారు.



ర్యాలీలో గాయపడిన కార్యకర్త మృతి

నవతెలంగాణ-తాంసి

మండలంలోని సుంకిడి నుంచి భీంపూర్ వరకు బుధవారం నిర్వహించిన ర్యాలీలో గాయపడిన కార్యకర్త మృతిచెందాడు. నియోజకవర్గ అభ్యర్థి సోయం బాపూరావ్‌కు మద్దతుగా చేపట్టిన ర్యాలీలో భీంపూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కార్యకర్త కుమ్రం రమేష్(21) బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. తీవ్రగాయలైన రమేష్‌ను 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతు గురువారం మరణించాడు. ఈమేరకు తాంసి ఎస్సై శివరాం రిమ్స్‌లో శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా రమేష్‌కు గతేడాది వివాహం అయింది.

పంట దిగుబడులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన పంట దిగుబడులు విక్రయించాలని ఏడీఏ మనోహర్ తెలిపారు. గురువారం కొత్తపేట పీఏసీఎస్ ఆవరణలో మొక్కలు, సోయాబిన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో రైతులు పండించిన మక్కలు, సోయాబిన్ పంటలను ఈ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోని మద్దతు ధర పొందాలని తెలిపారు. మక్కలు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2090, సోయాబిన్ క్వింటాలు రూ. 4600లు చెల్లించనున్నట్టు చెప్పారు. స్థానిక దళారులు, వ్యాపారులకు విక్రయించుకొని మోసపోవద్దని ఏడీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, ఏఎంసీ కార్యదర్శి సిద్ధంశెట్టి భాస్కర్, సీఈఓలు ముక్త్యార్, సతీష్, ఏఈఓలు సృజన, యువరాణి, రోహిణి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఎన్‌టీపీసీ ఉద్యోగి గంగిశెట్టి పోచయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య గత ఐదు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాదు వెళ్ళాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న రెండు గ్రాముల బంగారం, 15 తులాల వెండి, రూ. ఐదు వేల నగదు చోరీ చేశారు. ఇంటి వెనుక నివాసం ఉండే పోచయ్య కూతురు మాధవి, వేణుగోపాల్ శుక్రవారం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో విచారణ చేపడుతున్నారు.

ఆడపిల్లలను తప్పక చదివించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆడపిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రులు చదివించాలని వారిని స్వతహాగా ఎదగనిద్దామని మహిళా సాధికారికత కేంద్రం వారు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన జూనియర్ కళాశాలలో మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ రాణి మాట్లాడుతూ ఆడపిల్లల అభ్యున్నతి కోసమే భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న సమాజంలో ఆడపిల్లలు ఆర్థికంగా మానసికంగా ఎదగాలని దీని కోసం తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాల్యవివాహాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎక్కడైనా అటువంటివి జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలకు ఎటువంటి ఆపత్కర అవసరాలు కలిగిన వెంటనే 181 నెంబర్‌కు ఫోన్ చేయాలని, చిన్న పిల్లలకు సంబంధించి ఇబ్బందులు కలిగితే హెల్ప్ లైన్ నెంబర్ 1098కు ఫోన్ చేయాలని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత అధికారి సాగర్ మాట్లాడుతూ బ్యాంకింగ్‌కు సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ చట్టం కల్పించిన రక్షణ వ్యవస్థపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే వాటిని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే



నవతెలంగాణ-దహెగాం

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ నాయకులు కోనేరు ఫనికుమార్ అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణ్‌చిచ్చాల గ్రామంలో గడపగడపకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనిఫెస్టోను ప్రతి ఒక్కరికి వివరించారు. కోనేరు కోనప్పను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, నాయకులు దండెర వెంకన్న, గోరె పోశన్న, రామన్న పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు ప్రతి కార్యకర్త వివరించాలని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం మండలంలోని బాబాపూర్ గ్రామంలో పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతు దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడితేనే విజయం సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి చేరాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోనప్ప పలు పార్టీలకు చెందిన కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రామగౌడ్ ఆనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఆయనను పరమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, మండల అధ్యక్షుడు వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు రాజన్న, కార్యకర్తలు విఘ్నేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని రాస్పెల్లి శివారులో సర్వేనెంబర్లు 484/1, 464/2 పట్టా కలిగి ఉండగా తన అనుమతి లేకుండా కొంతమంది దళారులు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని గురువారం కలెక్టర్ ఫిర్యాదు చేసినట్టు రైతు తిరుమల్ రెడ్డి తెలిపారు. తనకు అన్యాయం జరుగుతుందని స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో బాధిత రైతు పేర్కొన్నారు.

ఆసిఫాబాద్ బీజేపీ అభ్యర్థిగా అజ్మీర ఆత్మరామ్ నాయక్

- జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అజ్మీర ఆత్మరాం నాయక్ పేరును మూడవ జాబితాలో ఆ పార్టీ నాయకత్వం కరారు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బీజేపీ గెలవడం ఖాయం అన్నారు. లంబడ తెగకు చెందిన ఆత్మరాం నాయక్ భార్య సంధ్యారాణి కైరిగూడ సర్పంచ్‌గా పనిచేస్తోంది. 1987లో జన్మించి ప్రస్తుతం రెబ్బెన మండలం గోలేటిలో నివాసం ఉంటున్నారు. తండ్రి పేరు చంద్రు నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా కొనసాగుతున్న ఆయన గత ఎన్నికల్లో కూడా బీజేపీ తరపున పోటీలో నిలిచారు. 2004 నుంచి 2018 వరకు టీఆర్ఎస్‌వీ ఎస్టీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసి తర్వాత బీజేపీలో చేరారు. అభ్యర్థిగా కరారు చేయడంతో ఆ పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు కొమరం వందన, రాధిక, సొల్లు లక్ష్మి, మండల అధ్యక్షుడు శ్రీదర్, మాటూరి జయరాజ్, సందీప్ రాథోడ్, సంతోష్, పులి సంజీవ్, ప్రకాష్, తిరుపతి, జగన్, పేంటయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

- కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సూచించారు. కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత గ్రామమైన మండువలో గురువారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిపాలన వ్యవస్థలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. సామాన్యులు సైతం స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గుడుంబా తయారు చేయడం, మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మారుమూల గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని పేర్కొన్నారు. అట్టి వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నాగరాజు, ఎస్సైలు రామనకుమార్, కొమురయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ఆదివాసులకు ఎళ్లవేళల అండగా ఉంటాం

నవతెలంగాణ-కౌటాల



ఆదివాసులకు ఎళ్లవేళల అండగా ఉంటూ వారి హక్కుల సాధనకు కృషి చేస్తామని, పోడు రైతులకు న్యాయం చేసేందుకు తన తముడు కోనేరు కృష్ణారావు జైలుకు సైతం వెల్లినట్టు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గుర్తు చేశారు. కాగజ్‌నగర్ మండలం సార్సాల గ్రామంలో పోడు రైతుల పక్షాన నిలబడ్డందుకు కేసులు పెట్టినట్టు ఆయన తెలిపారు. గతంలో ఆదివాసీ గిరిజనులను బీసీలో చేర్పించేందుకు ప్రయత్నాలు జరిగినట్టు, దాని కోసం తాను ఎంతో కృషి చేశానని, దానికి ఇక్కడున్న ఆదివాసీ నాయకులే సాక్ష్యమన్నారు. 2004లో గెలిచిన తర్వాత ఆదివాసులకు రెండు వేల ఇండ్లు ఇప్పించానని, ప్రస్తుతం మూడు వేల ఇండ్లు మంజూరైతే అందులో ఎస్‌టీలకే ఎక్కువ శాతం కేటాయించినట్టు ఆయన గుర్తు చేశారు. త్వరలో ఆదివాసుల కోసం రెండు వేల ఇండ్లు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రెబ్బెన గ్రామంలో 130 పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. పట్టాలు ఇవ్వడంతో పాటు రైతుబంధు, రైతుబీమా కూడా అందించినట్టు ఆయన గుర్తు చేశారు. పోడు పట్టాలు పొంది ఇటీవల మృతి చెందిన ఆడిపెల్లి గ్రామానికి చెందిన గడ్డం సత్తయ్య, బారెగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు కుటుంబాలకు రూ.ఐదు లక్షల రైతుబీమా అందించినట్టు తెలిపారు. పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులకు వ్యవసాయ బావులు, మోటార్లు, విద్యుత్ కనెక్షన్ ఇప్పించి వ్యవసాయ రంగంలో అభివృద్ధి చేసే బాధ్యత నాదన్నారు. ఇది వరకు కోయగూడలో 26 బావులు, విద్యుత్ కనెక్షన్‌లు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఆదివాసుల బిడ్డలకు వివాహాలు జరిపించి కానుకలు అందించినట్టు, ఏ ఒక్క నాయకుడు మీ కోసం చేసిన సేవ ఏంటో గుర్తుంచుకోవాలన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శుక్రవారం నవంబర్, 03, 2023

జోనల్ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జోనల్ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో స్లేట్ హైస్కూల్‌కు చెందిన 9 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో భానుచందర్, నితిన్ నాయక్, అరవింద్, కృష్ణదేశాయ నాయక్, మనితేజ, అండర్-17 విభాగంలో శీల మణికంఠ, రుత్విక్ రాధా, అలంకార్, సబిల్‌లు అదిలాబాద్ జోనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు సంతోష్, నగేష్, శివ, నాగలక్ష్మి అభినందించారు.

బీఆర్ఎస్ గెలుపు కృషి చేయాలి



నవతెలంగాణ-కౌటాల

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకు ప్రతి ఒక్క కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. గురువారం మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. మీ అందరి ఆశీర్వాదంతో సిర్పూర్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తానని, రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

- కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ



నవతెలంగాణ-తాండూర్

రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ అన్నారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లిలో నిర్వహించిన చేపల పెంపకం శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఐదు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతులకు మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ఆసక్తి చూపిన 25 మంది రైతుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ రైతులు స్థానిక వనరులను ఉపయోగించుకొని వ్యవసాయంతో పాటు చేపల పెంపకం కోళ్ల పెంపకం చేపట్టాలని సూచించారు. కుటీర పరిశ్రమల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని తెలిపారు. చేపల పెంపకానికి మత్స్యశాఖ ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ జనరల్ శ్రీ.విజయ్ కుమార్ ఆన్‌లైన్ విధానం ద్వారా రైతులకు వివరించారు. మొదటి రోజు కార్యక్రమానికి సబ్జెక్టు ఎక్స్పర్ట్‌గా విచ్చేసిన మత్స్య విభాగ అధికారి డా.భవ్యశ్రీ రైతులకు చేపల రకాలు పెంపకం మార్కెట్ ధర తెలియజేశారు. చేపల పెంపకం కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. చేపలు వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల మీద శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సిబ్బంది తోపాటు 25 మంది శిక్షణ పొందుతున్న రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుని జన్మదినం



నవతెలంగాణ-జన్నారం

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బల్మూరి జన్మదిన వేడుకలను గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనాథలకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయి నాయక్, మండల ఇన్‌ఛార్జి చీటీ తరుణ్, బన్నీ పాల్గొన్నారు.

శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-తాండూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూర్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం తాండూర్ సర్కిల్ పరిధిలోని తాండూర్, భీమిని, కన్నెపెల్లి మాదరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రౌడీ షీటర్స్‌కు కౌన్సిలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకుగాను పోలీసు శాఖ పట్టిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టిన భయపెట్టిన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో గ్రూపు తగాదాలు గొడవలు జరిగిన ప్రాంతాల్లో పోలీసు శాఖ నిగా ఉంచిందన్నారు. తాండూర్ సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. రాజకీయాలే వేదికగా వ్యక్తిగత కక్షలకు పాల్పడవద్దని తెలిపారు. సర్కిల్ పరిధి లేని పోలీస్ స్టేషన్ల రౌడీ షీటర్లకు సత్రప్రవర్తనతో మెలగాలని వారికి సూచిస్తూ ముందస్తు చర్యల్లో భాగంగా వారిని తహసీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేసినట్లు తెలిపారు.

సరిహద్దు గ్రామాల్లో రేఖనాయక్ ఎన్నికల ప్రచారం



నవతెలంగాన-కెరమెరి

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముకుద్ధం గూడ, పరందోలి మహారాజ్ గూడ గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్‌కు ఓటు వేసి అజ్మీరా శ్యామ్ నాయక్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట స్థానిక కాంగ్రెస్ నాయకురాలు రాథోడ్ రాజేంద్ర కుమారి బాయి, రాజు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన తుంగూరి బాలాజీ(19) అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు జన్నారం ఎస్సై పీ.సతీష్ తెలిపారు. బాలాజీ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఎన్ని అస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాకపోవడంతో ఇంట్లోంచి భయటకు వెల్లకుండా మస్తాపానికి గురయ్యాడు. మానసికంగా కృంగిపోయి తన ఇంట్లోని బెడ్ రూమ్‌లో దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని రాఘవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామ పంచాయతీలో గురువారం బీఆర్ఎస్ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ నయకులు ఫజల్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో మరోసారి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎలుక రవి గౌడ్, గ్రామ సర్పంచ్ రాథోడ్ లక్ష్మి కలిరామ్, భీమరాజు, అంజాద్ బాయ్, పోడేటి మల్లేష్, నేరెళ్ల రాజశేఖర్, కన్నే రాజలింగు, మేరుగు బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● ఎంపీ వెంకటేష్ నేత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేత

నవతెలంగాణ - కాసిపేట

బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించి, మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పెద్దపల్లి ఎంపీ, బెల్లంపల్లి ఇన్‌చార్జి వెంకటేశ్ నేత పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్ యాపలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యతో కలిసి మాట్లాడారు. ప్రతి కార్యకర్తకు, నాయకులకు అండగా ఉంటామని, కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఉండి మూడోసారి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. ఎమ్మెల్యేగా దుర్గం చిన్నయ్యను గెలిపించాలని కోరారు. సర్వే ప్రకారం 76సీట్లలో గులాబీ జెండాను ఎగరవేస్తామని, ముచ్చటగా సీఎం కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి అవుతున్నారన్నారు.

పేదోడిని మూడోసారి గెలిపించాలి : దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి నియోజవర్గంలో ఒక పేదవాడిని, రైతు బిడ్డను మూడోసారి గెలిపించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గత ఎన్నికల్లో కోట్లాది రూపాయాలు పెట్టి గెలవాలని చూసి ఓడిపోయి పత్తాలేకుండా పోయి మళ్లీ డబ్బుల సంచులతో గడ్డం వినోద్ వచ్చాడని తెలిపారు. స్థానికంగా ఉండి సేవ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలని కోరారు. డబ్బులతో మాత్రమే గెలుస్తామని విర్రవీగుతూ వచ్చే వారికి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ కర్ణాటకలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోతోందని, కాంగ్రెస్ మాటలను ప్రజలు ఎలా నమ్ముతారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన పమలతో పాటు ఇప్పుడు ఎన్నికల్లో గెలిస్తే చేయనున్న పనులను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. అనంతరం 80 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, సహకార చైర్మన్ నీలా రాంచందర్, రైతుబంధు అధ్యక్షుడు దుర్గం పోశం, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాపాట్ శంకర్, ఓసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అప్పాల శేఖర్, మంజులారెడ్డి, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, సర్పంచులు ఆడి బాదు, ఆడె జంగు, దేవి, భూక్య సునీత, అజ్మీర తిరుపతి, రాంటెంకి శ్రీనివాస్, నాయకులు మడావి అనంతరావు, అబ్జెపల్లి శ్రీనివాస్, అగ్గి సత్తయ్య, జాడి రాంచందర్ భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్ కోసం పరస్పర దాడులు

● ఇరు గ్రూపులను నిలువరించిన ఎస్ఐ సనత్‌కుమార్



నవతెలంగాణ-దహెగాం

భూమి రిజిస్ట్రేషన్ గొడవ చిలికిచిలికి గాలి వానలా మారింది. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన పట్టాదారులతో వారి బంధువులు ఒకరికొకరు దాడులు చేసుకొనే స్థాయికి చేరింది. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగింది. సిర్పూర్(టి)కి చెందిన ఫహిమాబాద్ బేగం, సాజిదాబేగం అనే మహిళలకు మండలంలోని లగ్గాం శివారులో సర్వే నెంబర్ 102/ఈ/ఏ/2లో చెరో రెండెకరాల భూమి ఉంది. ఆ భూమి తమకు వీలునామాగా వచ్చిందంటూ సదరు పట్టాదారుల మేనల్లుళ్లు బెజ్జూర్ మండలం కాటపెల్లికి చెందిన నస్రత్ అలీఖాన్, జీసద్ అలీఖాన్, అమీర్ అలీఖాన్, అర్బాగ్ అలీఖాన్ అభ్యంతరం తెలిపారు. అమ్మడానికి వీలులేదని, ఈ భూమిపై కోర్టులో కేసు వేశామని పేర్కొన్నారు. దీంతో గురువారం ఆ భూమిని సదరు పట్టాదారులు అమ్ముకోగా రిజిస్ట్రేషన్ ఉండడంతో మేనల్లుళ్ల కార్యాలయానికి వచ్చారు. ఈ భూమిపై కోర్టు కేసు ఉందని, రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపాలని తహసీల్దార్‌ను కోరారు. దీంతో కోర్టు నుండి ఏమైన ఆర్డర్ ఉంటే చూపించాలని, లేదంటే రిజిస్ట్రేషన్ ఆపడం కుదరదని తహసీల్దార్ తేల్చి చెప్పారు. అప్పటివరకు బాగానే ఉండగా, మహిళల బంధువులు సైతం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవడంతో ఒక్కసారిగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఎస్ఐ సనత్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఇరువురిని దాడులు చేసుకోకుండా అడ్డుకున్నారు. దాడులకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు.

ఎన్నికల విధుల పట్ల అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి

● సిర్పూర్ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి



నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు తమ విధుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఇతర అధికారుల సమన్వయంతో ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని సిర్పూర్ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎం, వీవీ ప్యాట్లపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరైె అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎన్నికలు సజావుగా సాగేందుకు కషి చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పీఓ డైరీ, హ్యాండ్ బుక్ పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి అంశాన్ని వీడియోగ్రఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పూర్తిగా తెలుసుకొని ఉండాలని, ఎన్నికల సంబంధిత చర్యలను నిబంధనలకు లోబడి మాత్రమే చేపట్టాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, తహసిల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-జైనథ్

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని మండల వైద్యురాలు నయనతా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు నైనత మాట్లాడుతూ 38 మంది విద్యార్థలను పరీక్షించి మందులను ఇచ్చామన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి పరిశుభ్రత పాటించాలని సూచించామన్నారు. అనంతరం కిచెన్‌ను సందర్శించి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీణ కుమారి, ఏఎన్ఎం గంగమణి, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించి, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ పార్టీ అభ్యర్థి ప్రియాంకను అధిక మెజారిటీ గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి మొలుగూరి సైదయ్య అన్నారు. గురువారం ప్రెస్ భవన్‌లో పార్టీ అభ్యర్థి ప్రియాంకను ప్రటించి బీ ఫారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అనుబంధ సంఘం ఆదివాసి భారత మహాసభ ఖానాపూర్ అభ్యర్థిణిగా పెందూర్ ప్రియాంకను ప్రకటించడం జరిగిందన్నారు. నియోజవర్గంలో ఆదివాసి జనాభా ఉన్న అబివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అంతంత మాత్రమే జరుగుతున్నాయన్నారు. కుమురం భీం, రాంజీ గోండు లాంటి పోరాట వీరులు ఆదివాసి గిరిజనుల హక్కుల రక్షణ కోసం ఎంతో కృషి చేసిన ప్రభుత్వాలు ఆ చట్టాలను అమలు చేయడంలో విఫలమవుతున్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు లింబాబాయి, రేఖ, విజయ్ ఉన్నారు.

కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన మహా వీరుడు కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని ఆదివాసీ నాయకులు ఏఎంసీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, సర్పంచుల సంఘం మండల అద్యక్షుడు యుర్వేత రూపదేవ్ అన్నారు. కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసులు హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మెస్రం తిరుపతి, కుమ్ర రాహుల్, రూపదేవ్ పటెల్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత డీపీఓ రాజేశ్వర్ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీపీఓగా విధులు నిర్వర్తించిన దుర్గం రాజేశ్వర్(98) గురువారం తుది శ్వాస విడిచారు. ఆదిలాబాద్‌లోని ఓల్డ్ హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న ఆయన విధి నిర్వహణలో తనదైన ముద్ర వేశారు. గురువారం అనారోగ్య కారణాలతో తనువు చాలించగా.. నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం శేఖర్ పార్థివ దేహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పంచాయతీ రాజ్ శాఖలో దుర్గం రాజేశ్వర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



c m y k

పెన్‌గంగ విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన పెన్‌గంగా విశ్రాంతి భవనాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ప్రారంభించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి భవనంలోని గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ రాథోడ్ రాజేశ్వర్, పర్యాటక శాఖ అధికారి రవీందర్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-తాంసి

ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలను గురువారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘం అధ్యక్షుడు తోట నరేందర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆవిర్భావించి నాటి నుంచి ఇప్పటి వరకు కార్మికులకు అండగా ఉంటు వారి హక్కుల సాధన కోసం ఉద్యమించిందన్నారు. ఈకార్యక్రమంలో సంఘం సభ్యులు పోచ్చాన్న, దత్తు, విలాస్, రాములు, వెనకటి, భూమన్న పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ ఉంటే తిరిగి ఇవ్వగలరు

నవతెలంగాణ-కెరమెరి

గ్రామంలో తన సర్టిఫికెట్స్ ఎవరి వద్దనైనా ఉంటే ఇవ్వగలరని మండలంలోని నాగల్ గొంది కదంగూడకు చెందిన రాష్ట్ర పాల్ కోరారు. తాను ఆగ్రాలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ పండిత్ పూర్తి చేశానని తెలిపారు. విశ్వవిద్యాలయం వారు సర్టిఫికెట్స్ పోస్ట్ చేయగా సుర్దాపూర్ పోస్ట్ మెన్ గ్రామానికి చెందిన వ్యక్తికి సర్టిఫికెట్స్ అందజేసినట్లు తెలిసిందన్నారు. పోస్ట్ మాన్ మరణించడంతో సర్టిఫికెట్స్ ఎవరికి ఇచ్చాడనే విషయం తెలియకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎవరి వద్దనైనా సర్టిఫికెట్స్ ఉంటే తిరిగి ఇవ్వగలరని వేడుకున్నారు.

గడప గడపకు బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-కౌటాల

ఈ నెల 30న జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప గెలుపు కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్ రావు అధ్వర్యంలో మండలంలోని శీర్షా గ్రామంలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని, కోనప్పను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ ఏరియాలోని కాశిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన సిరిగిరి మహేష్, వద్ద రూ.2700 విలువ గల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై బన్సిలాల్ తెలిపారు. నిందితున్ని విచారించగా తాను గత కొన్ని నెలలుగా తన ఇంటిలో బెల్ట్ షాప్ నడుపుతూ మద్యం అమ్ముచున్నట్లు తెలుపగా పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుని కలిసిన నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణానికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుట్ల ప్రవీణ్‌ను పలువురు నాయకులు కలిశారు. గురువారం ఆయనను పీపీ మేకల మధుకర్, బోండ్ల వెంకటస్వామి, నాయకుడు రాజన్న, ప్రభాకర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యునితో వారు పలు అంశాలపై చర్చించారు.

మాదిగల విశ్వరూప సభ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప సభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ చౌక్ వద్ద కరపత్రాలు పంపిణీ చేసి, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల ఐక్యతను ఎలుగెత్తి చాటడానికి విశ్వరూప రూప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మాదిగలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వాలకు మాదిగల సత్తా తెలియజేయడానికి ఇది మంచి వేదిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రేగుంట మహేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపల్లి రాజలింగు, మండల చెన్నూరి నాగేష్, పెంటపర్తి లక్ష్మణ్, సుద్దాల మురళీ, దుర్గం వెంకటేష్, మాటూరి దుర్గాప్రసాద్, నాయకులు బొమ్మెన మల్లయ్య దుర్గం సంతోష్, మహేష్, చిప్పకుర్తి పెంటు, రాజయ్య, శంకర్ పాల్గొన్నారు.

మనస్థాపం చెంది యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-జైనథ్

మనస్థాపం చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం బోరజ్ గ్రామంలో జరిగింది. నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సింగిడి రమకాంత్(27) వ్యవసాయ కూలిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుండి మనస్థాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే దళిత బంధు రాలేదని కారణంతో ఆత్మహత్యం చేసుకున్నట్టు అతని వద్ద సూసైడ్ నోట్ దొరికనట్లు స్థానికులు తెలిపారు. తన చావుకు సీఎం కేసీఆర్‌యే కారణమని అందులో ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన తరువాత విచారణ చేపడుతామని జైనథ్ పోలీసులు తెలిపారు.

సరస్వతి కాలువలో ద్విచక్ర వాహనం లభ్యం

నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని సరస్వతి కాలువలో గురువారం ద్విచక్రవాహనం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌సాగర్ జలాశయం నుంచి సరస్వతి కాలువకు నీటి ప్రవాహాన్ని తగ్గించడంతో కాలువలో టీఎస్-18 బీ 9664 నెంబర్ గల ద్విచక్రవాహనం లభ్యమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ద్విచక్ర వాహనం కాలువలో దొరకడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు ద్విచక్ర వాహనం ఎవరిదని పోలీసులు విచారణ చేపడుతున్నారు.



విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

నవతెలంగాణ-ముధోల్

విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ముధోల్ సీడీపీఓ శ్రీమతి అన్నారు. గురువారం మండలంలోని చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, కారేగాం, విట్టోలి తండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కొన్ని కేంద్రాల్లో పిల్లలు తక్కువ హాజరవడం, మెనూ ప్రకారం భోజనం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటిస్తూ, మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని సూచించారు. కేంద్రాలకు పిల్లలు ఎక్కువ శాతం హాజరయ్యేలా చూడాలన్నారు.

చిన్నయ్యకు సంఘీభావం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని బోయపల్లి గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు మద్దతు తెలిపారు బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా చిన్నయ్య చేసిన అభివృద్ధి పనులే ఆయనను గెలిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రదేవి, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన శాసనసభ నియోజకవర్గ నెంబర్ 005 ఆసిఫాబాద్ నియోజకవర్గ నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి వేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, ఫిర్యాదుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అక్కపూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని అక్కా పూర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడ ̓పకు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల చంద్రశేఖర రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన బోయి సత్తెమ్మ, సాయిలుకు చెందిన నివాసపు గుడిసె దగ్ధం కాగా ఆ కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు లచ్చేవార్ నితిన్ నిత్యావసర సరుకులను అందజేశారు. గురువారం షార్ట్ సర్క్యూట్ వల్ల నివాసపు గుడిసె దగ్ధం అయ్యింది. దాంట్లో చేపలు పట్టే వలలు, కండేలతోపాటు, దుస్తులు ఖాళిపోయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే నితిన్ ఘటన స్థలానికి వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారికి బియ్యం నిత్యావ సర సరుకులను అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొల్ల శ్రీకాంత్, రబ్బాని, చిర్రోల్ల రాకేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నీలాలో వాహనాల తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని నీలా గ్రామ శివారులో ఎస్సై ఉదయ్ కుమార్ ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా నగదును తరలించరాదని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక పోలీసు బందోబస్తుల మధ్య రోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.